క్లుప్తంగా

ఆమె నేత్రాలు అజరామరం


సింహాచలం (ఫైల్)

బిక్కవోలు: ఊలపల్లి గ్రామానికి చెందిన సిరికి సింహాచలం (85) శుక్రవారం మృతి చెందడంతో ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. వివేకానంద సేవాసమితి అవగాహన కల్పించడంతో సింహాచలం కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఆమె కార్నియాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకు సిబ్బంది వచ్చి సేకరించారు. దాత కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

వ్యక్తి అరెస్ట్

బిక్కవోలు: బిక్కవోలు గ్రామంలో పంచాయతీ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన ప్రత్తిపాటి రాధాకృష్ణను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై వాసంశెట్టి రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బిక్కవోలు పంచాయతీ ఆధ్వర్యంలో 20న గ్రామంలోని సీసీ రోడ్డు వేస్తుండడంతో దానిని రాధాకృష్ణ అడ్డుకున్నాడన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రోజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని అన్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించిందన్నారు.

ఘనంగా వన సమారాధన


బలభద్రపురంలో ఉసిరి చెట్టు వద్ద పూజలు చేస్తున్న తహసీల్దార్ కృష్ణ

బిక్కవోలు: బలభద్రపురంలో మండల రేషన్ డీలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. దీనికి తహసీల్దార్ కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై ఉసిరి చెట్టు వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన సమారాధనలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. రెవెన్యూ ఉద్యోగులు, వీఆర్వోలు, రేషన్ డీలర్లు ఒకచోట కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం తహసీల్దార్‌ను సత్కరించారు. డీలర్లు గొలుగూరి సూర్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బొడ్డు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రబీ సాగుకు నీరివ్వండి

మధురపూడి: కోరుకొండ మండలంలోని మెట్ట ప్రాంత గ్రామాల్లో రబీ సాగుకు నీరు ఇవ్వాలని గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ వంకా రాజు, వైఎస్సార్ యువజన విభాగం గ్రామ శాఖ అధ్యక్షుడు దిద్ది శ్రీకాంత్, పార్టీ నాయకుడు కోరుమెల్లి పెంటస్వామి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ సాగునీరు అందక పోతే పంటనష్టం జరుగుతుందని వాపోయారు. కూటమి ప్రభుత్వం ప్రకటనలే తప్ప ఆచరణలో చేస్తున్నదేమీ లేదన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండవ పంటకు కూడా సాగునీరందించి రైతుల పక్షపాతిగా నిలిచిందన్నారు. ఆరుతడి పంటలైన మొక్కజొన్నకు కూడా మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నీరు అందించారన్నారు.

హైందవ సంస్కృతి పరిరక్షణకు కృషి

పెదపూడి: హైందవ సంస్కృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ ప్రవచనకర్త గురూజీ త్రినాథ్ అన్నారు. అనపర్తి శేషగిరావు పేటలోని సాయి మందిరంలో ఓం శక్తి సత్సంగం ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. గురూజీ త్రినాథ్ భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. అనంతరం గురూజీని ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో సాయి మందిరం కమిటీ ప్రతినిధులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

27న వివిధ వస్తువులకు బహిరంగ వేలం

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) రాజమహేంద్రవరం డిపో పరిధిలోని వివిధ ప్రభుత్వ మద్యం షాపులకు సంబంధించిన వివిధ వస్తువులకు ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం వేయనున్నారు. ఈ విషయాన్ని ఏపీఎస్‌బీసీఎల్ రాజమహేంద్రవరం డిపో మేనేజర్(ఇన్‌చార్జి) ఎం.అబ్దుల్ ఖదీర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో ధవళేశ్వరం హార్లిక్స్ ఫ్యాక్టరీ పక్కన ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని దాసరి సీతారామకృష్ణ గోడౌన్ వద్ద వేలం జరుగుతుంది. ఈ వేలంలో 131 ఫ్రీజర్లు (ఒక్కొంటికి నిర్ణయించిన ధర రూ.22,680), 132 ఇన్వర్టర్ అండ్ బ్యాటరీలు(ఒక్కొంటికి రూ.18,630), 145 క్యాష్ చెస్ట్‌లు (ఒక్కొంటికి రూ.6,120), 287 స్కానర్లు (ఒక్కొంటికి రూ.3,400), 145 క్యాష్ కౌంటింగ్ మెషీన్లు (ఒక్కొంటికి రూ.810)ను వేలం వేస్తారు. ఎక్కడ ఉన్న వస్తువులు అక్కడే ప్రకారంగా వేలం జరుగుతుంది. ఆసక్తి కలవారు ముందుగా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు నకలు సమర్పించి, దరఖాస్తు రుసుముగా రూ.5 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలి. పాట దక్కించుకున్న వారు 18 శాతం జీఎస్టీతో కలిపి చెల్లించాలి. పాటపాడుకోని వారికి దరఖాస్తు రుసుమును తిరిగి చెల్లిస్తారు. పూర్తి సమాచారం కోసం 94407 85620, 95059 68533, 99493 51502 నంబర్లను సంప్రదించాలి.

కనుమరుగు

- ముగిసిన టైప్ మెషీన్ల శకం
- కంప్యూటర్ రాకతో మాయం

రాజానగరం: ఒకప్పుడు చిన్నపాటి ఉద్యోగం పొందాలన్నా టైపింగ్ ముఖ్య అర్హతగా ఉండేది. విద్యార్థులందరూ సాయంత్రం సమయంలో, సెలవులలో టైపింగ్ నేర్చుకుంటూ కనిపించేవారు. దీంతో టైప్ సెంటర్లన్నీ కిటకిటలాడుతూ ఉండేవి. కానీ ఆ పరిస్థితులు లేవు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో అంతా కంప్యూటర్ల మయమైపోయింది. బాల్యంలో అక్షరాభ్యాసానికి పలక బలపం తప్పనిసరిగా అవసరం అయ్యేది. అది కూడా నేడు ఎలక్ట్రికల్ స్లేట్, స్లేట్ పెన్సిల్ పరమైపోయింది.

గతంలో ఎంతో ఆసక్తి

గతంలో హైస్కూల్ విద్యతో పాటే చాలామంది టైపింగ్ నేర్చుకునేందుకు ఆసక్తి చూపేవారు. దీని కోసం స్కూలు లేదా కాలేజీ అయిన తరువాత టైప్ ఇనిస్టిట్యూట్స్‌కు వెళ్లి గంటల సమయం కేటాయించారు. టైపింగ్ నేర్పించే నిర్వాహకులకు (టైప్ మాస్టర్లు) ఫీజులు చెల్లించేవారు. ఈ టైప్ ఇన్‌స్టిట్యూట్లు ఎక్కువగా నగర ప్రాంతాలలోనే ఉండటంతో అబ్బాయిలు సైకిళ్లపై వెళ్లేవారు. అమ్మాయిలు మాత్రం కాలేజీలకు వెళ్లే సమయంలోనే టైపింగ్ నేర్చుకునేవారు. పట్టణాలలో వారైతే తీరిక సమయాలలో వెళ్లేవారు. ఒక్కో ఇన్‌స్టిట్యూట్‌లో కనీసం నాలుగు టైప్ మెషీన్లకు తక్కువ కాకుండా ఉండేవి.

ప్రభుత్వ కార్యాలయాలలో ..

ప్రభుత్వ కార్యాలయాలలో టైప్ మెషీన్ తప్పనిసరిగా ఉండటమే కాదు, అందుకు ఒక పోస్టును కూడా కేటాయించారు. టైపింగ్‌లో వేగం ఆధారంగా ఉద్యోగాలు లభించేవి. ఇందుకు గాను లోయర్, హైయర్ అని రెండు గ్రేడులలో ఏటా రెండు పర్యాయాలు పరీక్షలు నిర్వహించి, ఏపీ టెక్నికల్ బోర్డు ద్వారా సర్టిఫికెట్లు అందజేసేవారు. వీటి ఆధారంగానే ఉద్యోగాలు పొందడానికి నిరుద్యోగులకు అవకాశం ఉండేది.

టైపింగ్‌లో శిక్షణ

పూర్వపు పంచాయతీ సమితులకు కేంద్రాలుగా ఉన్న రాజానగరం, కోరుకొండలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాలలో టైపింగ్ మెషీన్లు ఉండేవి. ఎవరికైనా టైపింగ్ అవసరం వస్తే రాజమహేంద్రవరం వెళ్లక తప్పేది కాదు. ఈ నేపథ్యంలో మూడు దశాబ్దాల క్రితం పైరెండు ప్రాంతాలలో ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో రెండు టైపింగ్ ఇన్‌స్టిట్యూట్లు నిర్వహించేవారు. జాబ్ వర్క్‌తో పాటు విద్యార్థులకు టైపింగ్‌లో శిక్షణ ఇచ్చేవారు. శిక్షణ ద్వారా విద్యార్థులు చెల్లించే ఫీజులతోపాటు జాబ్ వర్క్స్ ద్వారా నిర్వాహకులు ఉపాధిని పొందేవారు. అంతేకాదు నిర్వాహకులలో మోతుబరులుంటే ఆయా సంస్థల నిర్వహణకు తక్కువ వేతనాలతో టైపింగ్‌లో అనుభవం ఉన్న నిరుద్యోగులకు అవకాశం ఇచ్చేవారు. ఈ విధంగా ఆ రోజులలో నిరుద్యోగులకు ఇవి కొంతమేరకు ఉపాధిని చూపించేవి. ఈ ఒరవడి దాదాపు 1990 వరకు కొనసాగింది. ఆ తరువాత కంప్యూటర్ల హవా పెరగడంతో ప్రభుత్వ కార్యాలయాలలోనే కాదు ప్రైవేట్ సంస్థలు, చివరకు కిరాణా స్టోర్స్‌లో కూడా నేడు కంప్యూటర్లు కనిపిస్తున్నాయి.

ముగిసిన శకం

టైప్ మెషీన్లపై టక్ టక్ టక్ మంటూ ఇంగ్లిషు, తెలుగు అక్షరాలను వేళ్లతో నొక్కితే ఆయా అక్షరాలు టైప్ మెషీన్‌లో ఉంచిన తెల్ల కాగితాలపై కార్బన్ రిబ్బన్ ద్వారా ముద్రపడేది. ఆ విధంగా టైపింగ్‌తో పరిచయం ఉన్న వారికి ఆధునికంగా వచ్చిన కంప్యూటర్ల కీబోర్డులపై టైప్ చేయడం సులభమయ్యింది. ఈ విధంగా టైపింగ్ టచ్ లేని వారికి మాత్రం కంప్యూటర్లు అంటే ప్రారంభంలో కొంత భయం వేసేది. భాషా పరంగా ఇంగ్లీష్ టైపింగ్, కంప్యూటర్‌లో కీబోర్డు చాలావరకు ఒక్కటే కావడంతో ఇంగ్లీష్ టైపింగ్ కష్టమయ్యేది కాదు. అదే తెలుగు అయితే కంప్యూటర్ కీబోర్డుపై కష్టపడవలసి వచ్చేది. నేడు చిరుప్రాయం నుంచే కంప్యూటర్ పరిజ్ఞానం అబ్బడంతో టైపింగ్ మెషీన్ల శకం దాదాపు ముగిసిందనే చెప్పవచ్చు. ఆ ఇన్‌స్టిట్యూట్లు కనిపించడం లేదు.


టైపు ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు (ఫైల్)



15 ఏళ్లు శిక్షణ ఇచ్చాను



రాజానగరంలో 1980 నుంచి 1995 వరకూ 15 ఏళ్ల పాటు టైప్ ఇనిస్టిట్యూట్ నిర్వహించాను. ఆ సమయంలో కుటుంబ పరిస్థితులు బాగోక ఇదే ఆధారంగా ఉండేది. కాలక్రమంలో కంప్యూటర్లు రావడంతో ఇన్‌స్టిట్యూట్ మూసివేయక తప్పలేదు. అయితే అప్పట్లో టైపింగ్‌లో స్పీడ్ ఉండటం వల్ల ప్రభుత్వ కార్యాలయాలలో టెంపరరీ వర్కు చేయించుకునేవారు. ప్రస్తుతం పిల్లలు అందుబాటులోకి రావడంతో వయసు రీత్యా విశ్రాంతి తీసుకుంటున్నా.

– వలసపాకల సత్యం

మహిళలు, పిల్లల భద్రతపై అవగాహన


సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో మాట్లాడుతున్న సీఐ సత్య కిషోర్, చిత్రంలో ఎస్సై రామ్ కుమార్

సీతానగరం: మహిళలు, పిల్లల భద్రతపై సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సత్య కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. పోలీసులను సంప్రదిస్తే వెంటనే తగిన చర్యలు తీసుకుంటారన్నారు. రోడ్డు నిబంధనలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఎస్సై డి.రామ్ కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వల్ల కలిగే అనర్థాలను తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిళ్లకు రేడియం స్టికర్లు

మంచు కారణంగా ఎదుట వచ్చే వాహనాలు కనిపించక రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని సీఐ సత్య కిషోర్, ఎస్సై డి.రామ్‌కుమార్ అన్నారు. సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో రోడ్డు భద్రతపై నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రమాదాల నివారణలో భాగంగా మోటారు సైకిళ్లకు రేడియం స్టిక్కర్లు అతికించారు.

విజయ దుర్గాంబిక అమ్మవారికి పూజలు

రంగంపేట: స్థానిక మంచినీటి చెరువు వద్ద విజయ దుర్గాంబిక ఆలయంలో అమ్మవారికి కార్తిక మాసం శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నారాయణశర్మ తెల్లవారు జామునే అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముగిసిన సప్తాహం

సింగంపల్లిలో కొలువైన ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో 16న ప్రారంభమైన సప్తాహ మహోత్సవం శుక్రవారంతో ముగిసింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏడు రోజులు నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన శ్రీరామభక్త భజన, సత్యసాయి రామభజన, లక్ష్మీదుర్గ భజన, లక్ష్మీ గణపతి భజన, శ్రీరామ రామలాల భజన, కోదండ రామ భజన, శ్రీనివాస భజన, మురళీకృష్ణ భజన సమాజాల వారిచే సప్తాహం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భజన సమాజ సభ్యులను ఘనంగా సత్కరించారు. 27న మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించనున్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

రంగంపేట ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా పార్థివలింగార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని శివ మాలధారులంతా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా తయారు చేసిన మట్టి శివ లింగానికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం శివలింగానికి గ్రామోత్సవం జరిగారు. అనంతరం స్థానిక మంచినీటి చెరువులో నిమజ్జనం చేశారు.

వైభవంగా లక్షపత్రి పూజ

సీతానగరం: కార్తిక మాసం సందర్భంగా సీతానగరం శివాలయంలోని ఉమా రామలింగేశ్వరస్వామికి శుక్రవారం లక్షపత్రిపూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి రాంబాబు, కొడమంచిలి మోహన్ శ్యామ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం జరిగింది. మచిలీపట్నానికి చెందిన చేబ్రోలు కృష్ణశర్మ, పాలకొల్లుకు చెందిన చేబ్రోలు మోహన్ తదితరులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. 25 మంది రుత్విక్కులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. రాత్రి 8 గంటల నుంచి అన్న సమారాధన నిర్వహించారు.

విజయదుర్గమ్మకు పంచామృతాభిషేకాలు

పెదపూడి: సంపర గ్రామంలో విజయదుర్గమ్మ వారికి శుక్రవారం పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు భక్తులతో లలితా, విష్ణు సహస్రనామ పారాయణ చేయించారు.


రంగంపేటలో విజయ దుర్గాంబిక అమ్మవారు


సింగంపల్లి ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో సప్తాహంలో మహిళలు


సీతానగరంలో ఉమా రామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు


బూరుగుపూడిలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి

వీరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి దేవాలయంలో కార్తిక మాసం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 2వ తేదీ నుంచి అర్చకుడు మానేపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, పూజలు జరుగుతున్నాయి. ప్రతి రోజూ ఓం నమశ్శివాయ అఖండ నామ జపం నిర్వహిస్తున్నారు. అలాగే ఈ నెల 29వ తేదీన లక్ష బిల్వార్చన, ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర జ్యోతిర్లింగార్చన, అన్న సమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త క్రొవ్విడి సత్రాజు తెలిపారు.

సత్యసాయి జయంతి ఉత్సవాలు

రంగంపేట: భగవాన్ సత్యసాయి బాబా జయంతి ఉత్సవాలను శుక్రవారం కోటపాడు గ్రామంలో నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్నాథ్ ఆధ్వర్యంలో బాబా చిత్రపటానికి, పాదుకలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాబా నామస్మరణ చేస్తూ గ్రామంలో బాబా చిత్రపటంతో రథోత్సవాన్ని నిర్వహించారు. శనివారం భగవాన్ సత్యసాయి బాబా జయంతి ఉత్సవాలను సుభద్రంపేట, రంగంపేట, కోటపాడు, ఈలకొలను, దొడ్డిగుంట తదితర గ్రామాల్లో నిర్వహించనున్నట్లు సబ్‌జోన్ కన్వీనర్ ఎం.వీర్రాజు తెలిపారు.


కోటపాడులో సత్యసాయిబాబా రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఓటుపై అవగాహన ర్యాలీ

సీతానగరం: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని ఏపీఎం జిలానీ అన్నారు. ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం సీతానగరం స్త్రీశక్తి కార్యాలయం నుంచి ఆయన ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిలానీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పాలకులను ఎన్నికోవడానికి ఓటు చాలా కీలకమన్నారు. మరింత సమాచారం కోసం 1950కు కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ర్యాలీలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కస్తూరి, గంగా ముత్యం, టీసీ వెంకటలక్ష్మి, అక్కౌంటెంట్ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.




సీతానగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీఎం జిలానీ తదితరులు

నిల్వ నీటితో అనేక వ్యాధులు


సీతానగరంలో నీటి కుండీలను పరిశీలిస్తున్న జోనల్ మలేరియా ఆఫీసర్ డాక్టర్ ఆశ

సీతానగరం: మండల గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని జోన్–2 జోనల్ మలేరియా ఆఫీసర్ డాక్టర్ ఆశ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎంటమాలజీ టీమ్‌తో కలిసి చినకొండేపూడి, సీతానగరాలలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి లోపల నీటి కుండీలు, ఫ్రిజ్‌లు, కూలర్లతో పాటు ఇంటి బయట పూలకుండీలు, కొబ్బరి డొక్కలు, ఖాళీ డబ్బాలు, డ్రైనేజీలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా డెంగీ, మలేరియా తదితర ప్రమాదకర వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఆమె వెంట డాక్టర్లు ఏవీకే చైతన్య, ఎస్.రాజు, రాజమహేంద్రవరం సబ్ యూనిట్ అధికారి పి.శ్రీహరి, ఎంపీహెచ్‌ఈవో హరి ప్రకాష్, వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ ఆదిలక్ష్మి, ఎంపీహెచ్‌ఎస్ కె.సుధాకర్, జి.దైవకృప ఉన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

సీతానగరం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపీయూటీఎఫ్) సీతానగరం మండల శాఖ నూతన కార్యవర్గం ఎంపికైంది. కాటవరంలోని సంజీవపురం పాఠశాలలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా కార్యదర్శులు ఎస్.రవి ఎన్నికల అధికారిగా, కె.నాగభూషణం, ఈ.శ్రీమణి ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. మండల అధ్యక్షుడిగా సబ్బితి రాజు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.పాపారావు, గౌరవ అధ్యక్షుడిగా ఎం.పోశయ్య, సహాధ్యక్షులుగా కె.నాగేశ్వరరావు, ఎస్.విజయలక్ష్మి, కోశాధికారిగా పి.సూరిబాబు, కార్యదర్శులుగా ఎంవీ రఘు, పి.సత్తిబాబు, కేఎస్‌ఎం కుమారి, వి.వెంకటేశ్వరరావు, ఎంఏ రాజు, ఆర్.రాంజీ ప్రసాద్, యు.వీరబాబు, కేఆర్‌ఏ రామకృష్ణ, ఎం సాంబశివరావు, ఆడిట్ కమిటీలో ముగ్గురు, జిల్లా మహాసభ ప్రతినిధులుగా ఏడుగురు ఎన్నియ్యారు.

పుష్కరాల్లో ప్రాణనష్టం లేకుండా చర్యలు చేపట్టాలి


సమావేశంలో పాల్గొన్న సంఘ నాయకులు

సీటీఆర్ఐ: గత పుష్కరాల అనుభవం దృష్ట్యా 2027లో పుష్కరాల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రానున్న పుష్కరాలు విజయవంతంగా నిర్వహించేందుకు స్థానిక నాయకులకు కీలక బాధ్యతలు అప్పగించాలని కోరారు. ఈ మేరకు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. గోదావరి పుష్కరాలు సజావుగా, సక్రమంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. సానబోయిన రామారావు మాట్లాడుతూ 2027లో జరిగే పుష్కరాలకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయాలన్నారు. గోదావరి పుష్కరాలకు నగరానికి 10 కోట్లమంది యాత్రికులు వచ్చే అవకాశం ఉందని, వారికి అవసరమైన భోజన, వసతి సదుపాయాలు కల్పించాలన్నారు. వైస్ చైర్మన్ ఎల్వీ ప్రసాద్ మాట్లాడుతూ పుష్కరాల సమయంలో రాజమహేంద్రవరం సిటీ, రూరల్, కొవ్వూరు, రాజానగరం వంటి ప్రాంతాలకు బంధువుల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. పేద బీసీ, ఎస్సీ కుటుంబాలకు ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం లేదా నిత్యావసరాలు అందజేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు డి.జార్జి ఆంటోనీ, ఉపాధ్యక్షుడు బత్తిన ప్రసాద్, ఉప్పిడి గంగాధర్, కోశాధికారి గుత్తుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఫౌండేషన్ సేవలు అభినందనీయం

రాజానగరం: దివాన్ చెరువులో డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొత్తగా ప్రారంభించిన వినయ్ విద్యా విహార్ స్కూల్‌ను శుక్రవారం కొత్త భవనంలోకి మార్పు చేశారు. మగ్గం వర్క్, టైలరింగ్, అల్లికలు, మున్నగు వాటిలో మహిళలకు ఉచితంగా శిక్షణ ఇస్తూ, జిల్లాలోని వివిధ ప్రాంతాలో ఈ ఫౌండేషన్ సేవలందిస్తున్న విషయం తెలిసిందే. అలాగే చిన్నారులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ స్కూల్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావును ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు అభినందించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

సౌత్ ఆసియన్ జియో సైన్సెస్ కాన్ఫరెన్స్

ఉత్తర ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో జరిగిన జియో ఇండియా 2024 ఆరో సౌత్ ఆసియన్ జియో సైన్సెస్ కాన్ఫరెన్స్ అండ్ ఎగ్జిబిషన్‌కు ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు ఇద్దరు విద్యార్థులతో కలిసి హాజరయ్యారు. ఎనర్జీ డైనమిక్స్‌లో కొత్త కోణాలను అన్వేషించడం అనే అంశంపై ఈ నెల 15 నుంచి 17 వరకూ జరిగిన ఈ సదస్సుకు 24 యూనివర్సిటీల నుంచి ఆచార్యులు, విద్యార్థులు తరలివచ్చారు. నన్నయ నుంచి వెళ్లి కె.శతన, ఎస్.తేజస్విని సాయి అత్యుత్తమ ప్రతిభతో గుర్తింపును పొందారని ఇన్‌చార్జి వీసీ తెలిపారు.



జియో సైన్సెస్ కాన్ఫరెన్స్‌కు హాజరైన ఇన్‌చార్జి వీసీ శ్రీనివాసరావు, విద్యార్థులు

నేటి నుంచి ఇషా గ్రామోత్సవ్ క్రీడా పోటీలు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని క్రీడా మైదానంలో శని, ఆదివారాలలో 16వ ఇషా గ్రామోత్సవ్ రూరల్ ప్రీమియం లీగ్ 2024 దక్షిణ భారత స్థాయి వాలీబాల్, త్రో బాల్ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీలలో విజేతలకు క్లస్టర్ స్థాయిలో పురుషులకు మొదటి బహుమతిగా రూ.9 వేలు, ఈ తర్వాత వారికి రూ.6 వేలు, రూ.3 వేలు, రూ. 2 వేలు చొప్పున అందిస్తారు. త్రోబాల్‌లో మహిళలకు మొదటి బహుమతిగా రూ.5 వేలు, ఈ తర్వాత రూ. 3 వేలు, రూ. 2 వేలు, రూ.1500 అందిస్తారు. ఫైనల్ పోటీలు కొయంబత్తూరులోని ఈషా ఆశ్రమంలోని ఆదియోగి సమక్షంలో జరుగుతాయని ఇషా ఫౌండేషన్ రాజమహేంద్రవరం వలంటీర్లు తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను నన్నయ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావుకు శుక్రవారం అందజేశారు.


వీసీ ఆచార్య శ్రీనివాసరావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఇషా ఫౌండేషన్ వలంటీర్లు

గంధం నారాయణరావుకు మద్దతుగా ప్రచారం



శ్రీరంగపట్నం పాఠశాలలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

మధురపూడి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గంధం నారాయణరావుకు మద్దతుగా ప్రచారం జోరందుకుంది. కోరుకొండ మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పల్ల రాజారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల సాధనతో పాటు, హక్కుల రక్షణ కోసం గంధం నారాయణ కృషి చేయగలరన్నారు. ఉపాధ్యాయుల నుంచి వస్తున్న స్పందనకు ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొమ్మకంటి సాంబశివరావు, ఎస్టీయూ జిల్లా నాయకుడు బండి శ్రీనివాస్, ఏపీయూఎస్ జిల్లా నాయకుడు ఫణికుమార్ పాల్గొన్నారు.